# భారతీయ-ప్రేమ



యుగయుగాల సంధిగ్ధత అతన్ని మెలివేయసాగింది.

సంస్కారపు పై పొర, అభిమానపు అడుగు తెర రెపరెప కొట్టుకొంటుండగా అతని హృదయం పెదవుల ద్వారా పలకసాగింది.

“స్త్రీ తన జీవితంలో ఒక్కణ్ణే మనసారా ప్రేమించగలుగుతుందా?”

“అవును!” ఆమె సమాధానం.

తరవాత ప్రశ్న ఎలా అడగాలో బోధపడలేదు. ధైర్యం లేకకాదు. తను దెబ్బతింటానేమోనని, భవిష్యత్తు అంతా అంధకారమౌతుందేమోనన్న సంకోచం... ఇప్పుడు కాకపోతే మరెప్పుడు తను అడగలేడు... సమయము, సందర్భము ఒకేసారి కలిసిరావు... అది అతనికి బాగా తెలుసు. అడుగులు చిన్నగా వేసుకొంటూ ఇన్నాళ్లూ పేరుకొన్న సంశయాన్ని దూరం చేసుకొన్నాడు.

